ప్రేమకు ప్రతిరూపంగా..



● మార్కెట్‌లో అందుబాటులోకి బహుమతులు

నేడు ప్రేమికుల దినోత్సవం



బహుమతులు చూపిస్తున్న నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: జీవుల మధ్య బంధాలు, అనుబంధాలు సహజం.. ఆ బంధాలను పంచేది, పెంచేది ప్రేమ. ఆ అనుబంధాలకు గుర్తులుగా బహుమతులను ఇస్తుంటారు. ఫిబ్రవరి 14 ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రేమికులు తమ ప్రేమను తెలుపుతూ బహుమతులు ఇస్తుంటారు. ప్రేమికుల అభిరుచులకు అనుగుణంగా మార్కెట్‌లో విభిన్నమైన బహుమతుల విక్రయాలు జరుగుతున్నాయి. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా బహుమతులపై ప్రత్యేక కథనం..

ప్రేమకు చిహ్నంగా..

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా భిన్నమైన బహుమతులు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. గిఫ్ట్ ఆర్టికల్ షాపుల్లో ప్రేమకు గుర్తుగా రేడియం స్టోన్స్, ఫైబర్, గ్లాస్, ప్లాస్టిక్ వంటి వాటితో పాటు టెడ్డీ బేర్స్‌తో ఉన్న బహుమతుల విక్రయాలు సాగుతున్నాయి. ప్రేమికులు వాలంటైన్స్ డే సందర్భంగా బహుమతులను కొనుగోలు చేస్తున్నారు. తమ అభిరుచులకు, సాంప్రదాయాలకు అనుగుణంగా బహుమతులను కొంటున్నారు.

రూ.100 నుంచి రూ. వేల వరకు..

బహుమతులు రూ.100 నుంచి వేల విలువైన వస్తువులు మార్కెట్‌లో విక్రయానికి ఉన్నాయి. విద్యుత్ లైట్లతో అమర్చిన బహుమతులు, రేడియంస్టోన్స్‌తో తయారు చేసిన బహుమతులు, స్టోన్ పౌడర్‌తో తయారు చేసిన వస్తువులు, లవ్ సింబల్స్‌తో కూడిన వస్తువులు, తాజ్ మహల్ వంటివి, కీ చైన్స్, టెడ్డీ బేర్స్ వంటి వాటిని ప్రేమకు గుర్తు బహుమతులుగా విక్రయిస్తున్నారు. కొన్ని బహుమతులు ఖరీదైనవి, వేల రూపాయల విలువైనవి కూడా విక్రయిస్తున్నారు. నూతన ప్రేమికులు, దంపతులు ఫిబ్రవరి 14 వాలంటైన్స్‌డే సందర్భంగా ఆయా బహుమతులను అందించేందుకు సిద్ధమవుతున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న బహుమతులు

ప్రతీ ఏడాది గిఫ్ట్ ఇస్తా..



మేము ప్రేమ వివాహం చేసుకున్నాం. వాలంటైన్స్ డే మా జంటకు ప్రత్యేకం. ప్రేమ ప్రత్యేకతగా వాలంటైన్స్ డే సందర్భంగా ప్రతీ ఏడాది బహుమతి కొనుగోలు చేస్తా. గిఫ్ట్ ఇవ్వటం ఓ మధురానుభూతి. వాలంటైన్స్ డే ప్రత్యేకంగా జరుపుకుంటాం.

– టి.గోవిందరావు, నేలకొండపల్లి

అభిరుచులకు అనుగుణంగా..



ప్రేమికుల అభిరుచులకు అనుగుణంగా బహుమతులు విక్రయిస్తున్నాం. వాలంటైన్స్ డే సందర్భంగా ప్రేమికులు, దంపతులు బహుమతులను కొనుగోలు చేస్తున్నారు. గతంలో ప్రేమికులు తమ ప్రేమను వివిధ రకాల కొటేషన్లు, సింబల్స్‌తో ఉన్న కార్డులను ఇచ్చేవారు.

– స్వామి రాజ్యలక్ష్మి, షాప్ నిర్వాహకురాలు, ఖమ్మం

క్లుప్తంగా

కేసీఆర్‌ను కలిసిన మాజీ మంత్రి పువ్వాడ



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవల్లిలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి పలు అంశాలపై మాట్లాడారు.

నియామకం



విజయకుమారి

ఖమ్మం మామిళ్లగూడెం: అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ జిల్లా అధ్యక్షురాలిగా ఖమ్మం లెనిన్ నగర్‌కు చెందిన వరకాల విజయకుమారి నియమితులయ్యారు. అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ జాతీయ చైర్మన్ షేక్ గౌస్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ సిరిపురపు అర్జున్ ఆమెకు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మానవ హక్కులకు భంగం కలగకుండా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం నగరంలోని బురహాన్‌పురం సబ్‌స్టేషన్ మైక్రోవేవ్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–2 ఏఈ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జైల్‌రోడ్, బురహాన్‌పురం, మజ్జారు కాలనీ, బస్‌డిపో రోడ్, మయూరిసెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సీఎంఏలో ప్రతిభ



రాంచరణ్‌ను అభినందిస్తున్న సోమయ్య

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని సిరి చైతన్య కళాశాల పూర్వ విద్యార్థి కె.రాంచరణ్ సీఎంఏ (కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్)లో ప్రతిభ కనబరిచాడని ప్రిన్సిపాల్ జి.సోమయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థిని అభినందించి మాట్లాడుతూ తక్కువ మందే సీఎంఏ ఉత్తీర్ణులవుతుండగా, అందులో తమ పూర్వ విద్యార్థి ఉన్నాడని వెల్లడించారు.

పేదలపై భారం

ఖమ్మంరూరల్: ప్రధాని మోదీ పేదలపై పెనుభారం మోపుతూ పెద్దలకు అండగా ఉంటున్నారని ఐద్వా నాయకురాలు బి.సరళ అన్నారు. మండలంలోని కస్నాతండాలో గురువారం వ్యవసాయ కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బీమా రంగంలో వందశాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడంతో ఎల్‌ఐసీ తీవ్రంగా నష్టపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో బి.పద్మ, పి. సుమతి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సంక్రాంతికి వస్తున్నాం
వినోద	తండేల్
సాయిరాం	డాకుమహారాజ్
ఆదిత్య	గేమ్‌చేంజర్
శ్రీనివాస	కెప్టెన్ అమెరికా: బ్రేవ్ న్యూ వరల్డ్, ఆరెంజ్

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	16	బచ్చలికూర	3
వంకాయ	18		20
బెండకాయ	44	పాలకూర	3
పచ్చిమిర్చి	24		20
కాకర	44	చుక్కకూర	3
బీర	38		20
దొండ	28	తోటకూర	3
పొట్లకాయ	34		20
చిక్కుడు	38	గోంగూర	4
గోరుచిక్కుడు	48		20
క్యాబేజీ	20	మెంతికూర	2
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	30	కొత్తిమీర	1
చామగడ్డ	50		40
క్యారెట్	30	పుదీన	1
క్యాప్సికం	44		25
బీట్‌రూట్	28	-ఖమ్మం వ్యవసాయం	

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: ఈనెల 21న ఖమ్మం స్థానిక రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర నాలుగో మహాసభను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్‌వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు కోరారు. గురువారం ఖమ్మంలో దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీలకు చట్టబద్ధమైన హక్కులు లేక వెట్టిచాకిరిగా చేస్తున్నారని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు బొమ్మకంటి రమేష్, జలగం రాంబాబు, లక్ష్మీనారాయణ, లచ్చయ్య, పాక లింగయ్య, ఐలయ్య, రవి, దాసు, రమేష్, శ్రీను ఉన్నారు.

మా భూములను కాపాడండి సారూ..

● కాలుష్య నియంత్రణ మండలిలో రైతుల ఫిర్యాదు



పీసీబీ కార్యాలయం వద్ద రైతులు

నేలకొండపల్లి: మండలంలోని అప్పలనరసింహాపురంలో కొనసాగుతున్న ఐరన్ ఫ్యాక్టరీతో సాగు భూములు పనికిరాకుండా పోతున్నాయని పలువురు రైతులు వాపోయారు. గ్రామానికి చెందిన రైతులు గురువారం హైదరాబాద్‌లోని కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) అధికారులను ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళితో పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. పలుమార్లు జిల్లా ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం వదిలేయాల్సిన పరిస్థితి నెలకొన్నందున తమకు న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో అంజిబాబు, వెంకటనారాయణ, శ్రీనివాసరావు, రమేష్ తదితరులు ఉన్నారు.

‘ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్’



సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

కామేపల్లి: ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని బీఆర్‌ఎస్ నాయకుడు ఆంతోటి అచ్చయ్య విమర్శించారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఇకనైనా బీఆర్‌ఎస్ నాయకులను విమర్శించడం మానుకుని పాలనపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం కామేపల్లి మండల బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సభ్యులుగా తీర్థాల చిదంబరరావు, కీసర విష్ణువర్ధన్‌రెడ్డి, సామా మోహన్ రెడ్డి, సభ్యులుగా వడియాల కృష్ణారెడ్డి, ఆంతోటి అచ్చయ్య, బోడేపూడి వీరప్రతాప్‌బాబు, కాత్రాల రాంబాబు, శంకర్, మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్, శ్రీనివాసరావు, సూర్య, అజ్మీరా రాజునాయక్, అజ్మీరా రాంకోటితో కమిటీని ఏర్పాటుచేశారు.

విక్రాంత్ భూరియాను కలిసిన మాజీ జెడ్పీటీసీ

కామేపల్లి: అఖిల భారత ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన విక్రాంత్ భూరియాను మాజీ జెడ్పీటీసీ బాణోతు వెంకట ప్రవీణ్‌కుమార్ హైదరాబాద్‌లో గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మండలంలో ఆదివాసీ, గిరిజన ప్రజల సమస్యలను భూరియా దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

నేలకొండపల్లి: మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య కోరారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 18 ఎంపీటీసీలకు 94 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. తహసీల్దార్ జె.మానిక్‌రావ్, ఎంపీఓ సీహెచ్.శివ, నాయకులు బచ్చలకూరి నాగరాజు, బోయిన వేణు, సూరేపల్లి రామారావు, పధానం నాగయ్య, కడియాల నరేష్, పాగర్తి సుధాకర్, మోహినుద్దీన్ ఉన్నారు.

నష్టపోతున్న రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న అశోక్

రఘునాథపాలెం: ఆరుగాలం కష్టపడి పండించిన రైతుకు గిట్టుబాటు ధర లేక అన్ని రకాలుగా నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవుల అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రఘునాథపాలెం మండలం రాంక్యాతండాలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మిర్చి దిగుబడి రాక రైతులు ఇబ్బంది పడుతున్నారని, పండిన కాసింత పంటను మార్కెట్‌కు తీసుకొస్తే సరైన ధర నిర్ణయించకుండా జెండా పాటలు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పంటలను దళారీలు, వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతన్నను అన్ని రకాలుగా నష్టపెడుతున్నారన్నారు. తక్షణమే రెండు లక్షల వరకు రైతులకు ఉన్న రుణాలను మాఫీ చేసేందుకు ప్రయత్నించాలని కోరారు. పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి, మాస్‌లైన్ మండల కార్యదర్శి కేలోతు లక్ష్మణ్, ధరావత్ లక్ష్మణ్, పాపారావు, వెంకన్న, ప్రేమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుపతమ్మ కల్యాణం



పూజలు చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని ధంసలాపురంలో బుధవారం రాత్రి శ్రీలక్ష్మి తిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కణతాల నరసింహారావు ఆధ్వర్యంలో ఈ మహోత్సవాన్ని నిర్వహించగా రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై పూజలు చేశారు. గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రానైట్ ఎగ్జిబిషన్‌లో రాయల



స్టాల్‌ను తిలకిస్తున్న నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: బెంగళూరులో జరుగుతున్న గ్రానైట్ ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్‌లో రాష్ట్ర చిన్న తరహా గ్రానైట్ పరిశ్రమల అధ్యక్షుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు హాజరై గ్రానైట్‌కు సంబంధించిన పాలిసింగ్ బిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గ్రానైట్ పరిశ్రమ గడ్డు పరిస్థితుల్లో ఉండటంతో ఎగ్జిబిషన్ కూడా వెలవెలబోయిందని, అక్కడ పెద్దగా స్టాళ్లు ఏర్పాటు చేయకపోవడంతో ఆశాజనంగా కనిపించలేదన్నారు. జిల్లా గ్రానైట్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

కూసుమంచి: మిర్చి రైతుల సమస్యలపై ఈనెల 17న ఖమ్మంలోని మిర్చి మార్కెట్ యార్డ్ వద్ద తెలంగాణా రైతు సంఘం ఆధ్వర్యాన తలపెట్టిన మహాధర్నాలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా నాయకులు మల్లెల సన్మంతరావు కోరారు. గురువారం కూసుమంచిలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. మిర్చికి క్వింటాకు రూ.25వేలు ధర చెల్లించాలని, మార్క్‌ఫెడ్ ద్వారానే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు తోటకూరి రాజు, కార్యదర్శి గంగాధర్, జగన్మోహన్‌రెడ్డి, వెంగళరావు, వెంకన్న గన్యానాయక్ పాల్గొన్నారు.

కందాళ పర్యటన

నేలకొండపల్లి/కూసుమంచి: పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి గురువారం కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో పర్యటించారు. శుభ, అశుభ కార్యక్రమాల్లో హాజరయ్యారు. డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య, నాయకులు కోటి సైదారెడ్డి, లీలా ప్రసాద్, సత్యనారాయణ, ప్రవీణ్, నరసింహారావు, ఆదాం, కనకప్రసాద్, గొలుసు రవి, భాస్కర్, మస్తాన్‌రెడ్డి ఉన్నారు.

వేడుకలను విజయవంతం చేయాలి

● రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

కూసుమంచి: ఈనెల 17న పాలేరు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే శ్రీ సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ఈ మేరకు సేవాలాల్ జయంతి వేడుకల పోస్టర్లను గురువారం ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వైరా ఎమ్మెల్యే బాణోత్ రాందాస్‌నాయక్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి, తిరుమలాయపాలెం మాజీ ఎంపీపీలు బాణోత్ శ్రీనివాస్ నాయక్, బోడ మంగీలాల్, దరావత్ రామ్మూర్తి నాయక్, బాణోత్ వినోద, బాసూ నాయక్, రవినాయక్‌తో పాటు ఉద్యోగులు భద్రూ నాయక్, శోభన్‌బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మండలంలోని మల్లేపల్లి, చేగొమ్మ గ్రామాల్లో మంత్రి పర్యటించి పలు శుభ, అశుభ కార్యక్రమాల్లో హాజరయ్యారు.

నేలకొండపల్లి: మండలంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ మేరకు రాజేశ్వరపురం గ్రామంలో పలు పార్టీలకు చెందిన నాయకులు సొసైటీ చైర్మన్ తన్నీరు కృష్ణమూర్తి, దండా సత్యనారాయణ, చిట్యాల రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. నేలకొండపల్లి, బైరవునిపల్లి లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను పరామర్శించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, వజ్జా రమ్య, భద్రయ్య, కొడాలి గోవిందరావు, బొందయ్య, గూడవల్లి రాంబ్రహ్మం, చెరువు స్వర్ణ, జెర్రిపోతుల అంజిని, జగన్, బ్రహ్మం, బోయిన వేణు, మోర మల్లయ్య, కొమ్మినేని విజయ్‌బాబు, కడియాల నరేష్, సూరేపల్లి రామారావు, బాలాజీ ఉన్నారు.

తుళ్లూరుకు శుభాకాంక్షలు

ఖమ్మంవన్‌టౌన్: డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య జన్మదినం సందర్భంగా మంత్రి పొంగులేటి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కరాటే వేణుకు అభినందన..

ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో విజేతగా నిలిచిన ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ కరాటే మాస్టర్ వేణును రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు. ఆయన క్యాంపు కార్యాలయంలో కరాటే వేణును శాలువాతో ఘనంగా సత్కరించారు.

సత్తుపల్లిలో దాడిపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ సత్తుపల్లి కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం బీజేపీ నాయకులు సీపీ సునీల్ దత్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, నాయకులు విద్యాసాగర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు టీకుమట్ల వీరుగౌడ్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు రవి రాథోడ్, దార్ల శంకర్ గౌడ్, శాసనాల సాయి రామ్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం



మాట్లాడుతున్న పర్వతరెడ్డి

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ నిరంతరం పోరాటాలు చేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వత రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని సంఘం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సంఘం అభ్యర్థి పూలరవీందర్‌ను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ కరామత్ అలీ, మాజీ అధ్యక్షులు వేముల మాధవరావు, సైదా, నరేందర్, మక్బూల్ ఖాన్, వెంకటేశ్వర్లు, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ మనిషిలో జీవనానుభవ కథలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభాకర్, తదితరులు

ఖమ్మం సహకారనగర్: ప్రతీ మనిషిలో జీవనానుభవ కథలు చాలా ఉంటాయని ప్రముఖ సాహిత్య విమర్శకులు డాక్టర్ ఏకె.ప్రభాకర్ అన్నారు. గురువారం ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఐక్యూ, ఏసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ‘కథలోకి.. కథ’ వర్క్‌షాప్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కథల్ని వినటం, చదవటంతో కథలు రాయవచ్చన్నారు. కథలంటే మనుషుల నడతలకు, వ్యక్తిత్వాలకు ప్రతిబింబాలన్నారు. తొలుత ఖమ్మం ఈస్తటిక్స్ కథలపై బీఏ ద్వితీయ సంవత్సర విద్యార్థిని పి.శృతి 35 కథల పరిచయం సమీక్ష పుస్తకం ‘కథాంశం’ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గవర్నింగ్ బాడీ సభ్యులు రవిమారుత్, తెలుగు, ఇంగ్లీష్, హిందీ విభాగాధిపతులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ నర్సమ్మ, డాక్టర్ గౌస్ షేక్, ఐక్యు, ఏసీ కోఆర్డినేటర్ సునంద, వైస్ ప్రిన్సిపాళ్లు ఏఎల్‌ఎన్ శాస్త్రి, డాక్టర్ బానోత్ రెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ గౌరవ సలహాదారులు ప్రసేన్, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ సీతారాం పాల్గొన్నారు.

మిర్చి తోటలోకి దూసుకెళ్లిన ట్యాంకర్

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారి మీదుగా గురువారం ఖమ్మం వైపు వెళ్తున్న ట్యాంకర్ అదుపు తప్పి రోడ్డు పక్కన మిర్చితోటలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన మండలంలోని జీళ్ల చెరువు వద్ద జరిగింది. హైదరాబాద్ నుండి ఖమ్మంకు అతివేగంగావస్తున్న ట్యాంకర్ జీళ్లచెరువు వద్ద అదుపు తప్పి డివైడర్ మధ్యలోని సైన్ బోర్డును ఢీకొట్టి తోటలోకి దూసుకెళ్లింది. ఆ సమయాన తోటలో ఎవరూ లేకపోవడం, ఆ మార్గంలో వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

వితరణ..



అంగన్‌వాడీకి అందజేసిన సామగ్రి

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు, విద్యుత్ మీటర్, ఫ్యాన్ పిల్లలకు పలకలు ఇతర సామగ్రిని ఖమ్మంకి చెందిన ఏలూరి శ్రీనివాసరావు కుమారుడు రాహుల్ వితరణగా అందించారు. ఈ మేరకు రాహుల్‌కు అంగన్‌వాడీ టీచర్ గీత కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలి



పార్టీ పతాకాన్ని ఎగురవేస్తున్న మౌలానా

కూసుమంచి: రానున్న స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలు సత్తా చాటేందుకు సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని గైగోళ్లపల్లి గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రామ్మూర్తి నాయక్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు గుండెపొంగు మల్లేష్, మండల కార్యదర్శి భూక్యా నర్సింహా, జల్లా లింగయ్య, కత్రోజు పాండురంగాచారి, సంగబత్తుల ఉపేందర్‌రెడ్డి, సత్యం, వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల వ్యాపారులకు జరిమానా



జరిమానా విధిస్తున్న కేఎంసీ ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని కాల్వొడ్డు ప్రాంతంలో రోడ్ల వెంట పండ్ల వ్యర్థాలు పడేస్తూ, సింగిల్ యూజ్ కవర్లను వినియోగిస్తున్న పండ్ల వ్యాపారులకు కేఎంసీ సిబ్బంది గురువారం జరిమానా విధించారు. కలెక్టర్ ఆదేశాలతో జరిమానా విధించినట్లు శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.సాంబయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మల్లయ్య, పి.వెంకటేశ్వర్లు, జవాన్ జుమ్మిడి రమేష్ తదితరులు ఉన్నారు.